# 'వసుంధర'

**నారాయణమూర్తిగారు వయ**సులో నాకంటే ఎంతో పెద్దకాదు. అయినా నా కాయన గురుతుల్యుడు. అన్నీ తెలుసునని నేననుకున్నప్పుడల్లా ఆయనతో మాట్లాడితే నాకేమీ తెలియదని తెలిసిపోయేది. చదువై పోయి ఉద్యోగం వచ్చేక మేము విడిపోయాం. ఆయన ఎప్పుడూ విజయవాడే. నాదిప్పుడు విశాఖపట్నం.

నారాయణమూర్తిగారు సాహిత్యోపాసకులు. ఆయన అన్ని రకాల సాహిత్యాన్నీ చదివి మంచి చెడ్డలు చెబుతూండేవారు. సాహిత్యం గొప్పతనం తెలిసేక నాకు రచయితలంటే ఆసక్తి బయల్దేరింది. క్రమంగా అది ఆరాధనగా కూడా



మారింది. విజయవాడలో రచయితలకు కొదువలేదు. కానీ నారాయణమూర్తిగారి కారణంగా నేను ఒక్క రచయితను కూడా కలుసుకోలేక పోయాను.

"సినిమాచూసి ఆనందించు. టెక్నీషియన్ల వ్యక్తిగత పరిచయం ఆశించకు. స్పోర్ట్సుచూడు క్రీడాకారులు వ్యక్తిగత పరిచయం ఆశించకు. అలాగే రచనలూనూ" అన్నాడాయన. అందుకాయన కారణంగూడా చెప్పాడు.

ఒక నటిగానీ, దర్శకుడుగానీ ఓ చలన చిత్రాన్ని అద్భుతంగా రూపొందించవచ్చు. గవాస్కర్ టెస్టు మ్యాచిల్లో 30 సెంచరీలు సాధిరెచినా, కపిల్‌దేవ్ జింబాబ్వేమీద 175 పరుగులు చేసినా అవి అద్భుతాలే! ఈ అద్భుతాల కారణంగా ఆయావ్యక్తులను మానవాతీతులుగా భావించడం జరుగుతుంది.అప్పుడు వారితో పరిచయం పెంపొందించుకుంటే- వారుకూడా అందరిలాగే సామాన్య మానవులనీ, ఉన్నత స్థాయికి ఎదిగినా అసూయాద్వేషాలను విడిచిపెట్ట లేదనీ, అహంకారాన్ని జయించ లేదనీ అర్థమవుతుంది. ఒకోసారి వారిలో సామాన్యుల కుండే పాటి సంస్కారంకూడా లోపించవచ్చు.

"కళాకారులు! క్రీడా కారులు చేసే అద్భుతాలను మనం కలకాలం ఆనందించాలంటేవారుమానవాతీతులన్న భ్రమ మనలో ఉండితీరాలి. ఆ భ్రమ మనకు మిగలాలంటే వారికి దూరంగా ఉండడమొక్కటే గత్యంతరం-" అన్నాడాయన-అందుకు దాహరణగా కొందరు ప్రముఖ గాయకులు, క్రీడాకారులు, నటులు, రచయితలు వగైరాల గురించి ఆయన నాకు చెప్పారు.

మిగతావారి విషయ మెలాగున్నా రచయితల విషయంలోనేనిది మానసికంగా అంగీకరించ లేకపోయాను. వారు ఎక్కడెక్కడి మనుషుల మనస్తత్వాలనూ కాచి వడపోసి రచనలు చేస్తారు. అలాటి వారు తమ మనసును సంస్కరించుకో లేరంటే హాస్యాస్పదంగా తోచిందినాకు. కానీ నారాయణమూర్తి గారితో వాదించి నెగ్గలేనని తెలుసు అందుకే వాదించ డానికి కూడా ప్రయత్నించలేదు.

ఇప్పుడు నాకు అనుకోకుండా ఒక రచయితతో పరిచయం కలిగింది. అతడు రచయిత అని నాకు ముందుగా తెలియదు. అతడికి స్వోత్కర్ష లేదు. మనిషి చాలాసింపుల్‌గా ఉంటాడు. అతడి రచనలు తరచుగా అన్ని పత్రికల లోనూ వస్తూంటాయి.

నారాయణమూర్తిగారు రచయితల విషయంలో పొరపడ్డారన్న విషయం ఋజువు చేయడం కోసమే నేనతడితో బాగా పరిచయం పెంపొందించుకున్నాను. పరిచయం పెరగ్గానే అతడి వల్ల నాకెంత మేలు జరుగుతున్నదీ అర్థమయింది. ఎన్నో విషయాల్లో అతడికున్న అవగాహన, పరిజ్ఞానంనాకు లేవు. ఇదా ప్రపంచం-అని తెలిసి ఆశ్చర్య పడ్డానుకూడా.

ఈ రచయితను నారాయణమూర్తి గారికి పరిచయం చేసి ఆయన దురభి ప్రాయాలన్నీ పటాపంచలు చేయాలను కున్నాను. నాకా అవకాశమిప్పు డానికే ఏమో—ఏదో పనిమీద నారాయణ మూర్తిగారు విశాఖపట్నంవచ్చి మా యింట్లోనే మకాం పెట్టారు-నేను రచయిత గురించి చెప్పగానే "—అలాగా అతణ్ణి తప్పకుండా కలుసు కుందాం-" అన్నారు నేనెంతో సంతోషించాను.

ఒకరోజు సాయంత్రం ఆయన్ను రచయిత యింటికి తీసుకుని వెళ్ళాను. రచయిత మమ్మల్నిద్దర్నీ సాదరంగా ఆహ్వానించాడు.

నారాయణమూర్తిగారు అతడి కొన్ని రచనల గురించి ప్రస్తావించి మెచ్చు కున్నారు. అతను మొహమాట పడ్డాడు. కాసేపవీ యివీ మాట్లాడేక— "రచయితగా మీ గురించి తెలుసుకోవా లనుంది. అసలే మీ రేవిధంగా ప్రేరణ పొందుతారూ, ఏమే పత్రికలకు రచ నలు పంపుతారూ; రచయితగా మీ వ్యక్తిగతాభిప్రాయా లేమిటి వగైరా—..." అన్నారు నారాయణ మూర్తిగారు.

రచయిత గొంతు సవరించుకుని-.... "నా చుట్టూవున్న సమాజమేనాకు ప్రేరణ. అలాగని అట్టడుగు వర్గాలగురించి రాయను. వారికేమీ చేయలేనప్పుడు—కేవలం పేరుకోసం వాళ్ళ గురించి నేను రాయలేను" అన్నాడు రచయిత.

నేను నారాయణమూర్తిగారి వంక గర్వంగా చూసాను. ఆయన నా చూపులు పట్టించుకోకుండా-"మీ రచ నలు బాగుంటాయి. అయితే అవి వాస్త వానికి దగ్గరగా వుంటాయి /ప్రస్తుతం మానవాతీత శక్తుల గురించి వచ్చే రచ నలకు మంచిగిరాకీ వుంది. మీరలాంటి వెందుకు రాయరు! అన్నాడు.

అందుకు చాలా కారణా లున్నాయి. మొదటిది విదేశీ సాహిత్యాన్ని కాపీ కొట్టడం నా కిష్టముండదు. రెండవది, ప్రచారమంటే నా కసహ్యం. రచయిత ప్రచారాన్నాశించడం అతడి పతనాన్ని సూచిస్తుంది-" అన్నాడు రచయిత.

"ప్రచారమంటే మీ అభిప్రాయం?"

"ఫోటోలను ముఖ చిత్రాలుగా వేయించు కోవడం. పాఠకులు తనకు రాసిన ఉత్తరాలను అచ్చేయించు కోవ డం. సంపాదకుల కాళ్ళు పట్టుకుని తన గురించి పదే పదే రాయించు కోవడం. పాఠకులతో అర్థం పర్థం లేని ముఖా ముఖిలు నిర్వహించడం. అమ్మాయిలు తనచుట్టూ తిరుగుతున్నారని చెప్పుకో వడం..."

నారాయణమూర్తిగారు వెంటనే-మీరు మీ ఫోటోను పత్రికల్లో వేయించు కోరా?" అన్నాడు.

ఫోటోను పరిచయానికి వాడుకో వడం వేరు ప్రచారానికి వాడడం వేరు. రచనకు బహుమతి వచ్చినప్పుడు ఫోటో పరిచయం తప్పనిసరి. అలాంటప్పుడు నా ఫోటోని ఎవరూ చూడ కూడదని భీష్మించు కోవడమూ నాకు కిష్టం. అలా భీష్మించు కోవడం కూడా ఒక రకం ప్రచారమే! అన్నాడు రచయిత.

"అలాంటప్పుడు—ప్రచార లోపమే మిమ్మల్ని అజ్ఞాత రచయితను చేసిం దంటారా! మీరు చాలా మంచి రచనలు చేసినా రావాల్సినంత పేరు మీకురాలేదు

మరి!" అన్నాడు నారాయణమూర్తి

రచయిత నవ్వి- "నేను పేరుకోసం కాక స్వయంతృప్తి కోసం రాస్తున్నాను. పాఠకుల నాకర్షింప చేయాలన్నది నా సంకల్పంకాదు. ఆలోచింప జేయాలన్నది నా అభిలాష. ప్రస్తుతం పాఠకులు కోరేది సస్పెన్సు-సస్పెన్సు దేముంది? పదిపేజీలు రాసి-తొమ్మిది పేజీలు మాత్రమే ప్రచురిస్తే ఆ ఒక్క పేజీ సస్పెన్సు...అంతేకదా! అన్నాడు.

"మీ రచనలు పాఠకుల నాకర్షించ దంలేదని మీకు తెలుసా?" అన్నాడు నారాయణమూర్తిగారు.

"అందుకు ప్రయత్నించాలన్న ఉద్దేశ్యముంటే-నేను ముందుగా ఏ ఆడపేరో కలంపేరుగా పెట్టుకునేవాణ్ణి- అన్నాడు రచయిత.

"ఇప్పుడు మగపేర్లకున్న డిమాండు ఆడపేర్లకులేదు-

"మీరు చెప్పిందీ నిజమే! అయితే నాలుగు కథలురాసి ఓ సంకలనం అచ్చేయించి దానికి పదిమందినీ ఆవిష్కరణ పేరుతో పిలిచి హడావుడి చేయడమూ నాకిష్టముండదు. మరి నా రచనల్లో పాఠకుల నాకర్షణేముంటుంది? అన్నాడు రచయిత.

"రచనలు పాఠకులకోసం. వారి నాకర్షించడం రచయిత డ్యూటీ!"

"నే నొప్పుకోను. ఈ రోజుల్లో రచనలు చదివి ఎవరూ రచయిత నారాధించడంలేదు. రచయిత వ్యక్తిగత జీవితాన్నిబట్టి అతడికి లభించే ప్రచారాన్నిబట్టి అతడి రచనలకు గిరాకీ ఉంటోంది. రచయిత వ్యక్తిగత జీవి







తంలో ఎన్ని తప్పులుంటే అదంత ఆకర్షణ......

"పోనీ ప్రచారంకోసం మీరూ కొంత ప్రయత్నం చేయవలసింది......

"అది రచయితకు ఆత్మ హత్యా సదృశం. రచయిత పేరు తెల్సుకునేందుకు రచన ఒక్కటే దోహదం చేయాలి ప్రచారమంటే పార్టీలకు వెళ్ళాలి. పేరున్నవారిచుట్టూ తిరగాలి. మందు కొట్టాలి. మీకు తెలుసో తెలియదో—నేను ఏ కాంతాన్నభిలషిస్తాను. సాహిత్య చర్చలు మినహా మరేవీ యిష్టపడను. నా అలవాట్లంటారా – విస్కీ, బ్రాందీ, బీరు దాకా ఎందుకు? ఆఖరికి కాఫీ, టీలు కూడా తాగను........."అన్నాడు రచయిత.

నేను మరోసారి నారాయణమూర్తి గారివంక గర్వంగా చూశాను. ఆయన రచయితతో చాలాసేపు మాట్లాడేను.

అక్కణ్ణుంచి బయటకు వచ్చాక —

"ఈ దెబ్బతో మీకు రచయితలపై అభిప్రాయం మారి ఉంటుంది-" అన్నాను.

నారాయణమూర్తిగారు నవ్వి-"ప్రతి రూలుకీ ఎక్సెప్షెన్సుంటాయి. ఆ విషయం నాకు తెలుసు-అన్నాడు.

"మీకు తెలియదు. తెలిస్తే నాకెప్పుడో చెప్పేవారు. ఇప్పుడు నేను చెప్పిన రచయితను కలుసుకున్నాకనే మీకావిషయం తెలిసింది-" అన్నాను.

"చాలా పొరపాటు. నాకతడిగురించి ఏమీ తెలియనిదే!"

"ముందేమీ తెలియదు, ఇప్పుడు తెలిసిందిగా!" అన్నాను.

"ఇప్పుడూ తెలియదు......"

"మరింతసేపు అతడితో మాట్లాడేరు అతడి గురించి ఏమీ తెలియలేదా"

"అతడు తన గురించి ఏమీ చెప్పందే ఎలా తెలుస్తుంది.

మరి ఇంతసేపూ అతడు మీకు చెప్పిందేమిటి?" అన్నాను అసహనంగా.

"అదా? తనతోపాటే రచనలుచేస్తూ తనకంటే ఎక్కువ పేరు తెచ్చుకున్న సమకాలిక రచయితలగురించిన రిమార్క్స్ అవి...అదే అతడు నాకు చెప్పాడు...అన్నాడు నారాయణమూర్తి గారు.

ఎప్పుడూ యింతే...అన్నీ తెలుసునని నేననుకున్నప్పుడల్లా నారాయణమూర్తిగారితో మాట్లాడితే నాకేమీ తెలియదని తెలిసిపోతుంది. ○